

# సమయ స్ఫూర్తి

◆ కె.రాజేశ్వరరావు

మా నాన్నగారు అర్జెంటుగా రమ్మని జాబు రాశారు. నాలుగు రోజులు సెలవు పెట్టి మా ఊరు గుట్టూరు చేరుకున్నాను.

ఆ రోజు రాత్రి భోజనాలయ్యాక వీధిలోకి వచ్చాను. గగనంలో నల్లని మబ్బులు తారట్లాడుతున్నాయి గమ్యం తెలియని బాటసారుల్లాగా. మబ్బులు, మెరుపులు, ఉరుముల్ని చూచిన బడుగు రైతుల గుండెల్లో ఆశలు చిగురించాయి. కాని అంతలోనే నిరుత్సాహం, నిస్పృహలు అలుముకున్నాయి. పాల పొంగు మీద నీళ్లు పడితే అడుగంటినట్లు వీళ్ల ఆశలూ అడుగంటాయి. ఈ మబ్బులు, ఉరుములు రాజకీయ నాయకుల హామీల్లాంటివని వీళ్లకు తెలుసు. అందుకే విశ్వసించలేకపోతున్నారు.

దారిలో మిత్రుడు కలిశాడు. అతనితో పిచ్చాపాటీ మాట్లాడుకుంటూ వీధిలో వెళుతున్నాను. ఓ చోట జనం గుమిగూడి ఉండటం గమనించి ఆగాను.

అందరూ తదేకంగా దేనినో చూస్తూ తీవ్రంగా చర్చించుకుంటున్న ట్లనిపించింది. విషయమేమిటో తెలుసుకుందామనే ఆదుర్దాతో దగ్గరి కెళ్లి నిలుచున్నాను.

వారి సంభాషణ ఇలా సాగుతోంది.

"చూడండి, ఆ వెలుగు ఒక్కోసారి ఎక్కువవుతోంది."

"అవును, కాస్త అటు ఇటూ కదిలినట్లు కనిపిస్తోంది."

"ఉన్నదున్నట్టుగా చిన్నది కావడం, మరల పెద్దది కావడం, కదిలినట్లుండడం చూస్తుంటే చాలా వింతగా తోస్తోంది."

"ఔను, నా చిన్నతనంలో మా తాతగారు నాకు చెబుతుండేవారు స్మశానంలో 'కొరివి దయ్యాలు' తిరుగుతూండేవని. అలాంటి దృశ్యాలు వారికి సర్వ సామాన్యాలట."

ఇంతలో ఓ పొలికేక వినబడింది.

సంభాషణ ఆపి ఆ గుంపులోని వారందరూ బిలబిల మంటూ అటువైపు పరుగు తీశారు. నేనూ వారిని అనుసరించాను. ఓ గుడి ముందు ఆగారు వారు. నేనూ అక్కడే నిలబడి ఏం జరుగుతుందో గమనించసాగాను.

అప్పటికే అక్కడ జనం పోగయ్యారు వలయాకారంలో నిలబడిన జనం నడుమ ఓ ఆజానుబాహుడు, మధ్య వయస్కుడు దబ్బపండు మేనిఛాయతో మెరసిపోతున్నవాడూ, పుష్టిగా, గాంభీర్యం తొణికిసలాడే వదనంతో ఊగిపోతూ నిలబడి ఉన్నాడు. 'అతనికి పూనకం వచ్చిందట' పక్కనున్న వాణ్ని అడిగితే చెప్పాడు.

ఒకరెవరో కుండతో మజ్జిగ తెచ్చిచ్చారు దాన్ని ఎత్తుకుని తాగుతున్నాడు గడగడా. కాని సగం తన దేహం మీద ఒలకపోసుకుంటున్నాడు కొద్దిగా నోటిలో పడుతోంది. మరొకరు గుడి గుమ్మాని వేలాడుతున్న నారతో పేనిన పెద్ద కొరడాల రెంటిని తెచ్చి అందించాడు. అవి ఆయన భుజస్కంధాలను అలంకరించాయి.

ఓ వృద్ధుడు ఒకింత ధైర్యం చేసి ముందుకు వచ్చి "స్వామీ! స్మశానంలో ఏదో వింత వెలుగు అగుపిస్తోంది. అదేమిటో సెలవిస్తారా ఊరికి ఏ కీడు మూడనున్నదో కదా! ఆ అరిష్ట నుండి ఊరిని కాపాడండి" అని చేతులు జోడించి ప్రాధేయపూర్వకంగా గ్రామస్థు

తరపున వేడుకునాడు.

పూనకం వచ్చినాయన ఊగిపోతూనే యోచనలో పడ్డట్టున్నాడు. కాస్సేపయ్యాక అరమోడ్పు కన్నులతో మంద్ర స్వరంతో "అది మీ ఊరిని కబళించేందుకు వచ్చిన మహమ్మారి 'కొరవి దయ్యం' నాయనా" అన్నాడు.

"ఆ భయంకర శక్తి నుండి మమ్మ కాపాడండి స్వామీ!" అని మరల వేడుకున్నాడాయన.

"అలాగే నాయనా" అని కొరడాను ఝుళిపించాడు. స్మశానం వైపు కదిలాడు.

అతని వెంటే కదిలింది ఆ గుంపు. ఏం జరుగుతుందో చూద్దామని నేనూ వారి వెంట వెళ్లాను.

దారి అంతా మిట్టపల్లాలతో, రాళ్లు రప్పలతో నిండి ఉంది. కన్ను పొడుచుకున్నా కానరాని చీకటి. బిక్కు బిక్కుమంటూ ఒకరినొకరు తోసుకుంటూ నడిచిపోతున్నారు. వాతావరణంలో నిశ్శబ్దం రాజ్యమేలుతోంది. అయినా అప్పుడప్పుడు ఆ నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ కుక్కలు మొరుగుతున్నాయి. నక్కలు ఊళలు వేస్తున్నాయి. గుడ్లగూబలు అరుస్తున్నాయ్. బీభత్సాన్ని సృష్టిస్తున్నాయ్.

'స్వామి తోడున్నాడు మనకేం భయం' అని జనులు, 'జనమంతా నా వెంటే ఉన్నారు నాకేం భయం' అని స్వామీ ఎవరిమటుకు వాళ్లు సర్దిచెప్పుకుని ధైర్యంగా ముందడుగు వేస్తున్నారు.

స్మశానం దగ్గరయ్యే కొద్దీ యువకుల్లో ఉత్కంఠ, ఉత్సుకత అధికం కాజొచ్చింది. 'కొరవి దయ్యం ఎలా ఉంటుందో చూసే అవకాశం దొరికింద'ని కొందరు లోలోన మురిసిపోతున్నారు. ఊపిరి బిగబట్టి గుండె దిటవు చేసుకుని స్మశానం కేసి నడుస్తున్నారు.

స్మశానం చేరుకున్నాడు స్వామి. స్వామి వెన్నంటే ఉన్నారు జనం. నేను ముందు నేను ముందు అనే విధంగా ఆత్రంగా ఎగబడుతున్నారు.

వెలుగు వస్తున్న చోట చేరుకున్నారు. ఉత్సుకతతో కుతూహలంతో గుడ్లప్పగించి చూస్తున్నారు జనం.

వారు అనుకున్నదొక్కటి, అయింది మరొక్కటి. స్వామి చెప్పినదానికీ, కనబడుతున్న దానికీ పొంతన లేదు.

స్వామి కూడా విస్తుపోయి చూస్తున్నాడు. టక్కున ఆగిపోయా డక్కడ. స్వామి వాలకం గమనించాను నేను.

ఏం చెప్పాలో తోచక దీర్ఘాలోచనలో నిమగ్నమయినట్లున్నాడు స్వామి.

మరలా అదే వృద్ధుడు ముందుకు వచ్చి "స్వామీ! ఇదేమీ చిత్రం? మీరు చెప్పినదొకటి, అగుపిస్తున్నది మరొకటి. కొరవి దయ్యం ఏమైందండీ?" అని కాస్త నిష్ఠూరంగా నిలదీసినట్టు అడిగాడు.

"అందులో సందేహం లేదు నాయనా! కొరవి దయ్యం వచ్చింది నిజమే. తన వికృత రూపాన్ని ప్రదర్శించి కరాళ నృత్యం చేసి వికటాట్టహాసం చేసి ఉండేదే. నేనే నా శక్తితో దానిని అరికట్టాను. నేను వస్తున్నానని తెలిసి భయపడి పలాయనం చిత్తగించింది. లేకుంటే ఊరు సర్వనాశనం అయి ఉండేది. అది వెళుతూ వెళుతూ ఊరికే పోలేదు చూడండి. ఈ మోడుబారిన ఈత చెట్టును ఉక్రోషంతో తగలబెట్టిపోయింది" అని మండుతున్న ఈత చెట్టును చూపిస్తూ సమయస్ఫూర్తిగా సమర్థించుకున్నాడు స్వామి.

"అలాగా స్వామీ! వెంటనే కనుక్కుని మీరు రావడం చాలా మంచిదయింది. కాస్త జాప్యం జరిగి ఉంటే మా ఊరు గతి అధోగతి అయి ఉండేది" అని తమ కృతజ్ఞతలు వెల్లడించుకుని తిరుగు ముఖం పట్టారు.

జనుల అమాయకత్వానికి, అజ్ఞానానికి, అనాగరకతకు మూఢ నమ్మకాలకూ నవ్వాలో, ఏడ్వాలో తెలియక పూనకం స్వామి 'సమయస్ఫూర్తి'ని మనసారా కాక పోయినా మనసులో అభినందించకుండా ఉండలేకపోయాను. ◆

